# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను




సంపుటి : 2 సంచిక : 297 బుధవారం 12 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# కాంగ్రెస్ పోస్టుమార్టం?

- లోక్‌సభ ఫలితాలపై తప్పెక్కడ జరిగిందని విశ్లేషించుకుంటున్న కాంగ్రెస్ నేతలు
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆరు నెలలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ కు సగభాగమే విజయం దక్కింది.
- సీఎం రేవంత్ రెడ్డి మిషన్-15 అంటూ పార్లమెంట్ ఎన్నికలలో 15 స్థానాలు గెలిచేలా వ్యూహాలు అమలు
- అన్ని నియోజకవర్గాలలో ధీటైన అభ్యర్థులనే నిలబెట్టిన.. గెలుపు అంచనాలు తారుమారు
- కనీసం 10 నుంచి 12 స్థానాలైనా పక్కాగా వస్తాయని అనుకున్న.. టార్గెట్ రీచ్ కాలేదు



హైదరాబాద్

లోక్ సభ ఫలితాలపై కాంగ్రెస్ నేతలు తప్పెక్కడ జరిగిందా అని విశ్లేషించుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆరు నెలలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ కు సగభాగమే విజయం దక్కింది. సీఎం రేవంత్ రెడ్డి మిషన్-15 అంటూ పార్లమెంట్ ఎన్నికలలో 15 స్థానాలు గెలిచేలా వ్యూహాలు అమలుచేశారు. దాదాపు అన్ని నియోజకవర్గాలలో ధీటైన అభ్యర్థులనే నిలబెట్టారు. ఖచ్చితంగా 15 స్థానాలలో గెలుపు అంచనాలు వేసి మరీ ఎన్నికల బరిలో దిగారు. కనీసం 10 నుంచి 12 స్థానాలైనా పక్కాగా వస్తాయని అనుకున్నారు. సగానికి సగమే విజయం సాధించడంపై తప్పెక్కడ జరిగిందని పునరాలోచన చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి.అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అనూహ్య విజయానికి రేవంత్ రెడ్డి అనుసరించిన వ్యూహాలు , పథకాలు ఆ పార్టీ అధికారంలోకి వచ్చేలా చేశాయి. కేవలం ఆరునెలల పాలనలోనే ఏ ప్రభుత్వం పైనా వ్యతిరేకత రాదు. అందులో ఆరు నెలలలోనే దాదాపు 5 పథకాలు అమలు జరిగేలా చేయడంలో రేవంత్ రెడ్డి చేసిన కృషికి అంతా హ్యాట్సాప్ చెబుతున్నారు. నియోజక వర్గాల వారీగా ఏ పార్టీకి ఎంత ఓటు బ్యాంకు నమోదైంది, కాంగ్రెస్ అంచనాలు ఎందుకు మారాయనే అంశాలపై రేవంత్ రెడ్డి సీనియర్లతో చర్చించినట్లు సమాచారం. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్ ఓటు షేర్ పెరిగింది. ఇదొక్కటి చాలు రేవంత్ పై తెలంగాణ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని రుజువు చేసేందుకు - మిగతా3లో



## కూల్ కూల్‌గా.. హాయిగా...

- 46 డిగ్రీల నుంచి యాభై డిగ్రీల వరకూ కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజల ఇబ్బందులు
- రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- ఎండల తీవ్రత నుంచి చల్లటి వాతావరణానికి మారడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు

హైదరాబాద్

నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత రెండు రోజుల నుంచి ఎండల తీవ్రత తగ్గింది. ఈసారి ఎండల తీవ్రత అధికంగా ఉంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 46 డిగ్రీల నుంచి యాభై డిగ్రీల వరకూ కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బయటకు రావడానికి కూడా భయపడిపోయారు. ప్రయాణాలను కూడా ఎండల తీవ్రత కారణంగా వాయిదా వేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఏప్రిల్ నెలలో ఎండలు దంచి కొట్టాయి. మార్చి నుంచే ఎండల తీవ్రత ప్రారంభమయింది. ఒక్క ఎండలు మాత్రమే కాదు.. వడగాలుల తీవ్రత - మిగతా3లో




## నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం

- "రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం విద్యతోపాటు ఇంగ్లీష్ మీడియం కూడా అందిస్తున్నాం
- కళాశాల విద్యకూ పెద్దపీట వేస్తున్నాం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైంది
- పేద పిల్లలకు మంచి విద్య అందించే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలలు పనిచేస్తాయి
- రెవెన్యూ గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి

భద్రాద్రి కొత్తగూడెం

జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు రెవెన్యూ గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన పాఠశాలల పునఃప్రారంభం సహా పలు అంశాలపై కొత్తగూడెం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పేద పిల్లలకు మంచి విద్య అందించే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలలు - మిగతా3లో

# టార్గెట్ తెలంగాణ!



- రాష్ట్రంలో జాతీయపార్టీల యాక్షన్ ప్లాన్ ఏంటి?
- కమలం స్కెచ్ ఏంటి? హస్తం వ్యూహం ఏంటి?
- అధికార కాంగ్రెస్‌కు ఏమాత్రం తగ్గకుండా.. రాబోయేది మేమే అన్నట్టుగా గట్టి పోటీనిచ్చింది బీజేపీ
- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ మంచి ఫలితాలు సాధించింది కాషాయసేన.
- పార్టీకి లోకల్‌గా ఊతమిచ్చేలా రెండు కేంద్రపదవులు కట్టబెట్టిన హైకమాండ్

హైదరాబాద్

2018 అసెంబ్లీఎన్నికల్లో ఒకేఒక్క సీటుగెలిచి డీలాపడిన బీజేపీ 2019 ఎన్నికల్లో అనూహ్యంగా నాలుగు ఎంపీ స్థానాలు గెలిచి సంచలనం సృష్టించింది. అలా మొదలైన జోష్ ఏమాత్రం తగ్గకుండా ముందుకుసాగుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ మంచి ఫలితాలు సాధించింది కాషాయసేన. అసెంబ్లీ స్థానాలను 1 నుంచి 8కి, పార్లమెంట్ స్థానాలనూ 4 నుంచి 8కి పెంచుకుంది. అధికార కాంగ్రెస్‌కు ఏమాత్రం తగ్గకుండా.. రాబోయేది మేమే అన్నట్టుగా గట్టి పోటీనిచ్చింది. ఎంపీ ఎన్నికల్లో ఊహించని రీతిలో 36శాతానికి ఓటింగ్ షేర్ పెరగడం.. కాషాయదళానికి - మిగతా3లో



## ఒడిశా ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝీ

- సీఎం ప్రమాణ స్వీకారం..
- రేపు మధ్యాహ్నం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు
- పలువురి పేర్లను పరిశీలించిన అనంతరం మాఝీ పేరును ఖరారు చేసిన బీజేపీ
- కియోంజర్ నుంచి 87 వేల పైచిలుకు మెజార్టీతో గెలిచిన మోహన్ చరణ్ మాఝీ
- ఉపముఖ్యమంత్రులుగా ఇద్దరికి అవకాశం?

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు




- మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు
- కేసులో నలుగురు అధికారుల అరెస్ట్
- బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన భుజంగరావు, తిరుపతన్న
- బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తి
- నేడు తీర్పు వెల్లడించనున్న నాంపల్లి కోర్టు

హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆరుగురిని నిందితులుగా చేర్చారు. కాగా మార్చి 10న ఎఫ్ఐర్ నమోదు చేసిన పోలీసులు మొత్తం ఆరుగురిపై అభియోగాలు మోపారు. ఇప్పటి వరకు నలుగురిని అరెస్ట్ చేశారు. కాగా అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న బెయిల్ పిటిషన్‌లు దాఖలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే తమను అరెస్టు చేసినట్టు నిందితుల తరపున లాయర్లు వాదనలు వినిపించారు. ఈ కేసులోసాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని - మిగతా3లో



## లోదుస్తుల్లో బంగారం స్మగ్లింగ్

- ముంబైలో ఇద్దరు విదేశీ ప్రయాణికుల అరెస్ట్..
- ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి రూ.19.15 కోట్ల విలువైన స్మగుల్డ్ బంగారాన్ని కస్టమ్స్ అధికారుల స్వాధీనం
- ఇద్దరు విదేశీ మహిళా ప్రయాణికులు ఆఫ్రికా దేశాలకు చెందిన వారు.

# బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మంత్రులు

**న్యూఢిల్లీ :** మంగళవారం నాడు పలువురు కేంద్ర మంత్రులు తమకు కేటాయించిన మంత్రిత్వ శాఖల బాధ్యతలు చేపట్టారు. మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు తరువాత సోమవారం సాయంత్రం పలువురు కేంద్ర మంత్రులకు శాఖలు కేటాయించారు ప్రధాని నరేంద్ర మోదీ. అంతేకాదు.. కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన తరువాత వారంలో కనీసం నాలుగు రోజులు ఢిల్లీలో మంత్రిత్వ శాఖ పనుల్లో ఉండాలని ప్రధాని సూచించారు. ఆయా మంత్రిత్వ శాఖలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని, పూర్తి పట్టు సాధించాలని మంత్రులకు చెప్పారు ప్రధాని. తొలి వంద రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. ప్రధాని సూచనలకు అనుగుణంగా కేంద్ర మంత్రులు బాధ్యతల చేపడుతున్నారు. ఈ రోజు బాధ్యతలు చేపట్టిన కేంద్ర మంత్రుల వివరాలు ఓసారి చూద్దాం..

కేంద్ర హెూంమంత్రిగా అమిత్ షా

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా గజేంద్ర సింగ్ షెకావత్



వ్యవసాయ శాఖ మంత్రిగా శివరాజ్ సింగ్ చౌహాన్

ఆరోగ్య శాఖ మంత్రిగా జెపి నడ్డా

కమ్యూనికేషన్ శాఖ మంత్రిగా జ్యోతిరాధిత్య సింధియా

విద్యుత్ శాఖ మంత్రిగా మనోహర్ లాల్

ఓడరేవులు, ఓడల శాఖ మంత్రిగా సర్బానంద సోనోవాల్

కార్మిక శాఖ మంత్రిగా మన్సుఖ్ మాండవియా

పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా కిరణ్ రిజిజు

రైల్వే శాఖ మంత్రిగా అశ్వనీ వైష్ణవ్

ఎంఎస్ఎంఈ శాఖ మంత్రిగా జితిన్ రాం మాంఝీ

శాస్త్ర సాంకేతిక, పిఎంఓ శాఖల సహాయ మంత్రిగా డాక్టర్ జితేంద్ర సింగ్

ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రిగా అనుప్రియ పటేల్

న్యాయశాఖ మంత్రిగా అర్జున్‌రాం మేఘవాల్

సమాచార, ప్రసారాల శాఖ సహాయ మంత్రిగా ఎల్ మురుగన్

పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా ఎం.ఎల్.ఖట్టర్

విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖల సహాయ మంత్రిగా జయంత్ చౌదరి బాధ్యతలు చేపట్టారు. బుధవారం నాడు రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రిగా నితిన్ గడ్కరీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తరువాత కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు బాధ్యతలు చేపట్టనున్నారు.

## మంత్రి పదవికి రాజీనామా చేసిన కాంగ్రెస్ నేత అలంగీర్ ఆలం



మనీలాండరింగ్ కేసులో గత నెలలో అరెస్టయిన జార?ండ్ కాంగ్రెస్ నేత ఆలంగీర్ ఆలం ఇవాళ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అదేవిధంగా జార?ండ్ అసెంబ్లీ కాంగ్రెస్ పక్షనేత పదవికి కూడా ఆయన రాజీనామా సమర్పించారు. అలంగీర్ ఆలం రాజీనామా చేసిన విషయాన్ని జార?ండ్ కాంగ్రెస్ చీఫ్ రాజేశ్ ఠాకూర్ ధృవీకరించారు. ఆలంగీర్ నుంచి అన్ని మంత్రి పదవులను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంపాయి సోరెన్ తీసుకున్న మూడు రోజుల అనంతరం ఆయన రాజీనామా లేఖ ఇచ్చారు. ఆలంగీర్ గ్రామీణాభివృద్ధి, పార్లమెంటరీ వ్యవహారాలు, గ్రామీణ పనులు, పంచాయితీ రాజ్ లాంటి నాలుగు శాఖల బాధ్యతలు చూసుకునేవారు. ఈ క్రమంలో మనీలాండరింగ్ కేసులో ఈడీ ఆయనను అరెస్ట్ చేసింది. గత నెల 6న అలంగీర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి అయిన సంజీవ్ లాల్ ఇంట్లో పనిచేసే జహంగీర్ ఆలం ఇంట్లో ఈడీ సోదాలు చేపట్టింది. ఈ సోదాల్లో రూ.37 కోట్ల భారీ నగదు పట్టుబడటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో అలంగీర్ ఆలంతోపాటు సంజీవ్ లాల్‌ను కూడా ఈడీ అదుపులోకి తీసుకుంది.

# ఒడిశా ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝీ



**భువనేశ్వర్ :** ఒడిశా ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝీ పేరును బీజేపీ ఖరారు చేసింది. ఒడిశాలో 24 ఏళ్ల బీజేడీ విజయపరంపరకు బీజేపీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గండికొట్టింది. ఫలితాల తర్వాత బీజేపీ ముఖ్యమంత్రి ఎంపిక వేటలో పడింది. పలువురి పేర్లను పరిశీలించిన అనంతరం మోహన్ మాఝీ పేరును ఈరోజు ఖరారు చేసింది. ఈయన కియోంజర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 87 వేల పై చిలుకు మెజార్టీతో గెలిచారు. కనక్ వర్ధన్ సింగ్, ప్రవతి పరిడాలను ఉపముఖ్యమంత్రులుగా నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ప్రవతి పరిడా నిమపర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. బీజేపీ, బీజేడీ అలయెన్స్‌లో 2000 నుంచి 2004 వరకు ప్రభుత్వం కొనసాగింది. ఆ తర్వాత బీజేడీ ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ వస్తోంది. ఇప్పుడు బీజేపీ మొదటిసారి అధికారంలోకి వచ్చింది. తాజాగా జరిగిన ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ సీఎం అభ్యర్థి ఎంపికపై కసరత్తు జరుగుతుంది. అందులోభాగంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం భువనేశ్వర్‌లో సమావేశమవుతున్నారు. ఈ సమావేశానికి న్యూఢిల్లీ నుంచి పరిశీలకులుగా కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, భుపేంద్రయాదవ్ హాజరవుతున్నారు. ఈ రోజు సాయంత్రానికి ఒడిశా సీఎం పేరు ఖరారు చేయనున్నారు. సీఎం రేసులో ముఖ్యంగా ముగ్గురు.. ఒడిశా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మన్మోహన్ సమాల్, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సురేశ్ పూజారీతోపాటు ఎమ్మెల్యే సింగ్ దేవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇక ఒడిశా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముహుర్తం సైతం ఖరారు అయింది. జూన్ 12వ తేదీ భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. అందుకోసం ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. అయితే ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతోపాటు.. పార్టీకి చెందిన పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని సమాచారం. ఇక సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులకు రేపు మధ్యాహ్నం.. ఒక పూట సెలవును ఒడిశా ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల ఒడిశా అసెంబ్లీలోని మొత్తం 147 స్థానాలకు నాలుగు విడతలుగా ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో ఒడిశా ఓటరు.. బీజేపీకి పట్టం కట్టాడు. దీంతో బీజేడీ దశాబ్దాల పాటు సాగిన పాలనకు ఫుల్ స్టాప్ పడినట్లు అయింది.



## లోదుస్తుల్లో బంగారం స్మగ్లింగ్..

ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి రూ.19.15 కోట్ల విలువైన స్మగుల్డ్ బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళా ప్రయాణికులు తమ లోదుస్తులు, లగేజీ బ్యాగుల్లో 32.79 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఇద్దరు విదేశీ మహిళా ప్రయాణికులు ఆఫ్రికా దేశాలకు చెందిన వారు. సోమవారం ఛత్రపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలు ల్యాండయిన తర్వాత అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న ఇద్దరు మహిళలను తనిఖీ చేయగా స్మగుల్డ్ బంగారం బయట పడింది. దీంతో సదరు ఇద్దరు మహిళా ప్రయాణికులను అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తునకు పోలీసులకు అప్పగించారు.

## టీవీలో వార్తలు చూసి.. సరదా కోసం విమానానికే బాంబు బెదిరింపు.. బాలుడి నిర్వాకం




దేశంలో ఇటీవలే బాంబు బెదిరింపులు ఎక్కువైపోయాయి. పాఠశాలలు, విమానాశ్రయాలు, పలువురు నేతలకు వరుస బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 13 ఏళ్ల బాలుడు సరదా కోసం టొరంటో విమానానికే బాంబు బెదిరింపు మెయిల్ పంపడం ఇప్పుడు కలకలం సృష్టిస్తోంది. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ నుంచి టొరంటో వెళ్లే ఎయిర్ కెనడా విమానానికి ఇటీవలే బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. విమానం గత మంగళవారం రాత్రి దేశ రాజధాని ఢిల్లీ నుంచి టొరంటో బయల్దేరేందుకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో విమానంలో బాంబు అమర్చినట్లు ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ కార్యాలయానికి రాత్రి 10:50 గంటల సమయంలో ఓ మెయిల్ వచ్చింది. దీంతో అధికారులు వెంటనే అప్రమత్తమై తనిఖీలు చేయగా.. బెదిరింపు బూటకమని తేలింది. బాంబు బెదిరింపు అనంతరం ప్రోటోకాల్‌ను అనుసరించి విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువూ, పేలుడు పదార్థాలూ కనిపించలేదు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు తాజాగా గుర్తించారు. ఈ పని చేసింది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌కు చెందిన 13 ఏళ్ల బాలుడని దర్యాప్తులో తేల్చారు. ఆ బాలుడు ఈ మెయిల్ పంపేందుకు ఏకంగా నకిలీ ఐడీని క్రియేట్ చేసినట్లు గుర్తించారు. మెయిల్ చేసిన అనంతరం బాలుడు అకౌంట్‌ను డిలీట్ చేసేసినట్లు అధికారులు తెలిపారు. సదరు బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. ఈ విషయాలు బయటపడ్డాయి. సరదా కోసమే బెదిరింపు మెయిల్ పంపినట్లు బాలుడు పోలీసులకు చెప్పాడు. ఇటీవలే పలు నగరాల్లోని పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చినట్లు టీవీలో వార్తలు చూశానని, వాటిని చూసి తనకు ఇలాంటి ఆలోచన వచ్చినట్లుగా పోలీసులకు చెప్పినట్లు అధికారులు తెలిపారు.

## ఆవుపాలు పిండుతున్న వ్యక్తిని కాల్చిచంపిన దుండగులు.. స్థానికుల ఆందోళన.. పరిస్థితి ఉద్రిక్తం..



ప్రాణం ఎప్పుడు ఏవిధంగా పోతుందో ఎవరికీ తెలువదని అంటుంటారు. కొన్ని సంఘటనలు జరిగినప్పుడు అది నిజమే అనిపిస్తుంది. తాజాగా బీహార్లో అలాంటి ఘటనే జరిగింది. ఓ వ్యక్తి తన ఇంటి ఆవరణలో ఆవుకు పాలుపిండుతూ హత్యకు గురయ్యాడు. బైకుపై వచ్చిన ఇద్దరు దండగులు ఆయనను కాల్చిచంపి పారిపోయారు. ఈ ఊహించిన పరిణామానికి స్థానికులు షాకయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. బీహార్ రాజధాని పట్నాలోని దనపూర్ ఏరియాలో ఝులన్ రాయ్ అనే 44 ఏళ్ల వ్యక్తి కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం కూడా అతడు ఇంటి ఆవరణలో తన ఆవుకు పాలు పిండుతున్నాడు. అదే సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైకుమీద వచ్చి అతడిని కాల్చిచంపారు. దుండగులు ఎవరో తెలియదు. ఎందుకు చంపారో తెలియదు. ఈ హఠాత్పరిణామానికి స్థానికులు ఖంగుతిన్నారు. దుండగులు ఇళ్లలో ఉన్న వాళ్లను కాల్చిచంపుతున్నా రక్షణ కరువైందని ఆందోళనకు దిగారు. ఝులన్ రాయ్ మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రోడ్లపై టైర్లను కాల్చి నిరసన తెలిపారు. దాంతో దనపూర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. స్థానికుల ఆందోళనకు సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.



## తుంగభద్రకు పెరుగుతున్న వరద..

**బళ్లారి(బెంగళూరు):** కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జీవనాడిగా నిలిచిన తుంగభద్ర ఇప్పుడిప్పుడే జల కళ సంతరించుకుంటోంది. రుతుపవనాల కారణంగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జలాశయం ఎగువ ప్రాంతాలైన అగుంబె, వర్నాడు, ఖుదరేముఖ తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగ, భద్ర నదులకు అ?ధిక స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ రెండు నదుల కలయికతో ఏర్పడిన తుంగభద్రలో వరద ప్రవాహం రోజు రోజుకు పెరుగుతుండంతో తుంగభద్ర జలాశయానికి జలకళ సంతరించుకోవడంతో ఆయకట్టు రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈసారి జలాశయానికి ముందుగానే వరద నీరు వచ్చి చేరుతోంది. ఈసారైన పంటలసాగుకు అవసరమైన సాగునీరు లభిస్తుందని ఆయకట్టు రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నీటి మట్టం 1580.23 అడుగులకు చేరుకుంది. 4,817 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతోందని, ప్రస్తుతం జలాశయంలో 4.58 టీఎంసీల వరద నీరు నిలువ ఉన్నట్లు జలాశయం అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో జలాశయానికి కేవలం 280 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరిందని బోర్డు అధికారులు తెలిపారు.

# హరియాణ సీఎంకు ఢిల్లీ ఎల్జీ ఫోన్



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని న్యూఢిల్లీకి మంచి నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని హరియాణ సిఎం నయాబ్ సింగ్ సైనీ హామీ ఇచ్చారు. ఈ మేరకు న్యూఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సెనా మంగళవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. వేసవి కారణంగా న్యూఢిల్లీలో మంచి నీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో నీటి కేటాయింపుల్లో భాగంగా న్యూఢిల్లీకి రావాల్సిన మంచి నీటిని సరఫరా చేయాలని హరియాణ సీఎంకు సోమవారం తాను స్వయంగా ఫోన్ చేసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని న్యూఢిల్లీ ఎల్జీ వీకే సక్సెనా పేర్కొన్నారు. ఢిల్లీలో మంచి నీటి ఇక్కట్లపై సోమవారం ఆమ్ ఆద్మీ మంత్రులు అతిషి, సౌరభ్ భరద్వాజ్.. తనను కలిశారని చెప్పారు. నీటి సంక్షోభంపై హరియాణా ప్రభుత్వంతో తాను చర్చిస్తానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చానన్నారు. మరోవైపు న్యూఢిల్లీలో మంచి నీటి సరఫరా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆప్ మంత్రులకు ఈ సందర్భంగా సూచించానని ఎల్జీ వెల్లడించారు. ఆ క్రమంలో సోమవారం హరియాణ సీఎంకు ఎల్జీ స్వయంగా ఫోన్ చేసి.. ఢిల్లీకి మంచి నీటి సరఫరాపై మాట్లాడారు. మరోవైపు బీజేపీ పాలిత రాష్ట్రం హరియాణ. ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఢిల్లీలో మంచి నీటి కొరత సృష్టించేందుకు కుట్రకు తెర తీసిందంటూ ఆప్ మంత్రులు సార్వత్రిక ఎన్నికల వేళ ఆరోపణలు గుప్పించారు. ఆ క్రమంలో హరియాణ మంచి నీటిని సరఫరా చేయాలని ఆదేశాలు ఇవ్వాలంటూ.. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించిన విషయం విధితమే

## రాహుల్ గాంధీ రాయ్‌బరేలి సీటు నిలుపుకోవాలి : అమేథి ఎంపీ




రాయ్‌బరేలి ప్రజలు రాహుల్ గాంధీ తమ ఎంపీగా కొనసాగాలని కోరుకుంటున్నారని, వ్యక్తిగతంగా తాను కూడా రాహుల్ రాయ్‌బరేలి నుంచే పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటానని అమేథి కాంగ్రెస్ ఎంపీ కిషోరీ లాల్ శర్మ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మంగళవారం రాయ్ బరేలి రావడంతో ప్రజల్లో ఉత్తేజం నెలకొందని అన్నారు. రాహుల్, ప్రియాంక కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. కాగా లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలి, కేరళలోని వయనాడ్ స్థానాల నుంచి రాహుల్ గాంధీ పోటీచేయగా, రెండు స్థానాల్లోనూ ఆయన విజయం సాధించారు.

# కాంగ్రెస్ పోస్టుమార్టం?


-మొదటిపేజీ తరువాయి

అని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఆరునెలల పాలనలో ఆరు గ్యారంటీల అమలు పై ప్రజలలో నమ్మకం ఏర్పడిందనడంలో ఎలాంటి సందేహం లేదని కాంగ్రెస్ సీనియర్లు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కేవలం 20 శాతం ఓట్లను మాత్రమే సాధించిన బీజేపీకి కేవలం ఆరునెలల వ్యవధిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో 35 శాతం ఎందుకు పెరిగింది అనే విషయంపై తీవ్రంగా చర్చ జరిపినట్లు సమాచారంఅసలు మిషన్-15 అంచనాలు తప్పడం వెనక బీఆర్ఎస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగే కారణం అని పార్టీ సీనియర్లు భావిస్తున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి షిఫ్ట్ కాకుండా ఉన్నట్టయితే కాంగ్రెస్‌కు అడ్వాంటేజ్‌గా మారేదని, కానీ రెండు పార్టీలూ కాంగ్రెస్‌ను ఉమ్మడి శత్రువుగా భావించి లోపాయకారీగా వ్యవహరించడం వల్లనే అంచనాలు తప్పాయని చర్చించుకున్నట్టు తెలిసింది. బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఆ పార్టీ పెద్దలు, అభ్యర్థులు గమనించారని, గెలవడం కష్టమేనన్న అభిప్రాయానికి వచ్చి బీజేపీకి సాయం చేసే ఎత్తుగడలను అవలంబించారనే భావనకు వచ్చారు. బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి మళ్లుతాయనే అంశాన్ని తొలుత సీరియస్‌గా పరిగణనలోకి



తీసుకోలేకపోయామని, దాని తీవ్రతను గుర్తించినట్టయితే వ్యూహం మరోలా ఉండి ఉండేదన్న అభిప్రాయాన్ని సీనియర్లు వ్యక్తం చేసినట్లు సమాచారం. కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తుందనుకునే నియోజకవర్గాల్లో లెక్కలు తప్పడానికి కారణం అనూహ్యంగా బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి బదిలీ కావడమేననే కంక్లూజన్‌కు వచ్చారు పార్టీ సీనియర్లంతా .అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ షేర్ లోక్‌సభ ఎన్నికల్లో పెరిగిందని, కానీ కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓట్లలో తేడా రావడంపైనా వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పడిన ఓట్ల కంటే ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో అవే సెగ్మెంట్లలో తక్కువ ఓట్లు పోలైన అంశాలపైనా సీనియర్లతో లోతుగా చర్చలు జరిగినట్టు సమాచారం. పార్టీ కేడర్ క్షేత్రస్థాయిలో తగినంతగా కష్టపడకపోవడమా? లేదా బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోగలిగిందా? లేదా బీఆర్ఎస్ ఓట్లు డైవర్ట్ కావడం వల్లనే ఓట్ షేర్‌లో వ్యత్యాసం వచ్చిందా..? ఇలాంటి అంశాలపైనా సీనియర్లు చర్చించుకున్నారు. ఆయా లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీల వారీగా పడిన ఓట్ల వివరాలకు అనుగుణంగా రహస్య సమీక్ష జరిగింది. దీనిపై అధిష్టానానికి త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ఓ నివేదిక ఇవ్వనన్నారు.

# కమలానికి కొత్త సారధి




హైదరాబాద్ : కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొలువుదీరింది. ఆయన మంత్రి వర్గంలో వివిధ రాష్ట్రాలకు చెందిన నేతలకు స్థానం కల్పించారు. దీంతో చాలా రాష్ట్రాల్లో పార్టీకి కొత్త అధ్యక్షులు ఎవరన్నది అసలు టాపిక్. ఇక అన్నింటికంటే ముందుగా తెలంగాణ విషయానికొద్దాం.కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది బీజేపీ హైకమాండ్. ఆయన చాలా సక్సెస్‌ఫుల్‌గా నడిపించారు. తాజాగా మోదీ 3.0 కేబినెట్‌లోకి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను తీసుకున్నారు. దీంతో తెలంగాణ బీజేపీకి కొత్త సారథి ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపైనే ఇప్పుడు నేతలంతా చర్చించుకుంటు న్నారు. సామాన్య కార్యకర్తకు సైతం పెద్ద పదవులు అందుకునే అవకాశం ఒక్క బీజేపీలో ఉందని నేతలు బహిరంగ సభలో తెగ ఊదరగొడతారు. ఆ మాదిరిగానే పార్టీలోని కార్యకర్త స్థాయి వ్యక్తికి తెలంగాణ అధ్యక్ష పదవి ఇస్తారా? లేక పార్టీల నుంచి వలస వచ్చిన నేతలకు ఛాన్స్ ఇస్తారా? ఇదే ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ బీజేపీ నేతలను వెంటాడుతున్నాయిఇప్పటికే తెలంగాణ బీజేపీలో దాదాపు మూడు వర్గాలు ఉన్నాయన్నది అంతర్గత సమాచారం. ఈ విషయంలో నేతలు నోరుజారిన పలు సందర్భాలు లేకపోలేదు. ఇప్పుడు ఆ వర్గాలకు చెందిన వ్యక్తులకు కాకుండా కొత్త వ్యక్తికి ఇవ్వాలని ఆలోచన చేస్తోందట ఢిల్లీ బీజేపీ. ఇప్పటికే డీకె అరుణ, లక్ష్మణ్, ఈటెల రాజేందర్ రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. తమకే ఆ పదవి వస్తుందని ఆయా నేతల మద్దతు దారులు బయటకు చెబుతున్నారు. ఈ మధ్యకాలంలో తెలంగాణలో ఎన్నికల లేకపోవడంతో పార్టీని అంటిపెట్టుకున్న నేతకు ఈ పదవి ఇస్తే బాగుంటుందని హైకమాండ్ ఆలోచనగా చెబుతున్నారు. ఎన్నికలకు ముందు మళ్లీ సీనియర్లకు అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే సరిపోతుందన్నది ఢిల్లీ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. త్వరలోనే దీనిపై బీజేపీ నుంచి స్పష్టత రావడం ఖాయమన్నమాట.

**ప్రముఖంగా వినిపిస్తున్న ఈటెల**

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి మరోసారి కేంద్ర మంత్రి పదవి వరించిది. మోడీ క్యాబినెట్‌లో వరుసగా రెండోసారి చోటు లభించింది. ఇప్పటి వరకు రెండు పదవులు నిర్వహిస్తు వస్తున్న కిషన్ రెడ్డి ఇకపై ఒకటే పదవిలో కొనసాగనున్నారు. దీంతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర బీజేపీ సారథి ఎవరూ అనే ప్రశ్న గట్టిగానే వినిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ బీజేపీ బాగానే ఓట్లు, సీట్లు రాబట్టుకుంది. అధికార పార్టీ కాంగ్రెస్‌తో సమానంగా సీట్లు సాధించింది. 17 సీట్లు తెలంగాణలో ఉంటే అందులో ఎనిమిదింటిని బీజేపీ గెలుకుంది. అందుకే సంస్థాగతంగా పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేస్తే కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాగలమనే ధీమాను నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు చేపట్టబోయే మార్పులు ఆ దిశగానే ఉంటాయని అంటున్నారు. తెలంగాణలో సగం ఎంపీ స్థానాలు కైవశం చేసుకొని జోష్ మీద ఉన్న బీజేపీ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగానే మల్కాజ్‌గిరి ఎంపీ అయిన ఈటల రాజేందర్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఆయన కచ్చితంగా కేంద్రమంత్రి పదవి వస్తుందనే ప్రచారం జరిగింది. ఉన్న సమీకరణాలతో అది సాధ్య పడలేదు. అందుకే ఆయన్ని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని చేస్తారనే ప్రచారం ప్రారంభమైంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ నినాదంతో వెళ్లిన బీజేపీ మెజార్టీ సీట్లు సాధించలేకపోయింది. అయితే మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ప్రజల ఆశీర్వాదం పొందింది. దీంతో అప్పట్లో ప్రచారం చేసినట్టుగానే బీసీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారని తెలుస్తోంది. దీంతోపాటు కమిట్మెంట్‌తో ఉన్న నేతలకు గుర్తింపు ఉంటుందని కూడా రెండు మంత్రిపదవులు ఇచ్చి చెప్పకనే చెప్పారు. మిగతా నేతలకి కూడా కీలకమైన పదవులు ఇచ్చి మరింత మందిని ఆకర్షించే ప్రయత్నాల్లో ఉంది బీజేపీ. బీజేపీ జాతీయ అధ్యక్షుడి నియామకం పూర్తైన వెంటనే వివిధ రాష్ట్రాల్లో మార్పులు చేర్పులు ఉంటాయని చెబుతున్నారు. ముఖ్యంగా తెలంగాణ బీజేపీ పాత్ర మరింత దూకుడుగా ఉంటుందని అంటున్నారు. అలాంటి నేతలకే పగ్గాలు అప్పగించనున్నారని టాక్ నడుస్తోంది.

# తెలంగాణకు కొత్త పోలీస్ బాస్.. కసరత్తు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టిపెట్టారు. ఇప్పటికే శాఖల వారీగా సమీక్షలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. రైతుబంధు జమ, పంట రుణాల మాఫీకి ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇదే క్రమంలో కీలక అధికారుల మార్పులు చేర్పులపైనా కసరత్తు చేస్తున్నారు. తాజాగా తెలంగాణ కొత్త డీజీపీ ఎంపికకు కూడా కసరత్తు మొదలు పెట్టారు.పాలనాపరంగా తన మార్కు చూపించేందుకు రేవంత్ సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పథకాలను అమలు చేసే విషయంలో అధికారుల పాత్ర కీలకం కావడంతో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వంలో కీలకంగా ఉన్న పలువురు ముఖ్య అధికారులను మార్చాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త డీజీపీని కూడా నియమించాలని భావిస్తున్నట్లు తెలిసింది. కొత్త డీజీపీపై ఇప్పటికే సీఎం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.సీఎం రేవంత్ కసరత్తు కొలిక్కి వస్తే.. రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు బదిలీ అవుతారని తెలుస్తోంది. సామాజిక న్యాయం, సీనియారిటీ ప్రాతిపదికన బదిలీలు చేపట్టేందుకు జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.ఇదిలా ఉండగా రాష్ట్రానికి కేంద్రం కొత్తగా రెండు డీజీ ర్యాంకులు ఇవ్వనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో రవిగుప్తా, అంజనీ కుమార్, సీవీ.ఆనంద్, జితేందర్ డీజీ హోదాలో ఉన్నారు. 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ ఇటీవలే మరణించారు. సందీప్ శాండిల్య ఉద్యోగ విరమణ చేశారు. జితేందర్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బాధ్యతలు అప్పగించారు. అంజనీ కుమార్ రోడ్ సేఫ్టీ డీజీగా ఉన్నారు.

**కొత్వాల్ గా మహిళా అధికారి**

హైదరాబాద్‌కు ఓ సీనియర్ మహిళా పోలీసు ఆఫీసర్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి చరిత్ర స్రుష్టించబోతున్నారా.. వారికి ఈ పోస్టు ఇచ్చినా సమర్థతవంతంగా నిర్వహించే సత్తా ఉన్న మహిళా ఆఫీసర్‌లు డిపార్ట్ మెంట్‌లో ఉన్నారని ఇప్పుడు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా సీనియర్ మహిళా పోలీసు ఆఫీసర్‌ను నియమిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సరికొత్త చరిత్ర శ్రీకారం చుట్టినట్లు అవుతుందని పోలీసు వర్గాలు అంటున్నాయి.

అయితే తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాంతి భద్రతల నిర్వహణలో ఏలాంటి రాజీ పడకుండా విధులను నిర్వహించే అధికారులను ఆయన బాధ్యతలను చేపట్టినప్పుడు నిర్ణయం తీసుకుని హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, సైబరాబాద్‌కు అవినాష్ మహంతి, రాచకొండకు సుధీర్ బాబును నియమించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్‌తో సుధీర్ బాబు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తరుణ జోషి రాచకొండ పోలీసు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు పూర్తయ్యి కోడ్ ముగియడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మార్క్ ఉండేలా పాలనను సాగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపడతారని కొన్ని రోజులుగా పోలీసు వర్గాలతో పాటు అధికారుల వర్గాల్లో చర్చ నడుస్తోంది.హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు బాసులు కూడా మారే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా మహిళా ఆఫీసర్‌కు దక్కే ఛాన్స్ ఉందనే వాదన ఇప్పుడు ఆసక్తిని రేపుతోంది.

ఇప్పుడు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో దాదాపు 8 మంది మహిళ ఆఫీసర్‌లు జోన్ డీసీపీలుగా సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తుండడంతో హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా మహిళా అధికారిని నియమిస్తే శాంత భద్రతల నిర్వహణ పటిష్టంగా నిర్వహించడంతో పాటు ప్రభుత్వం మహిళ రక్షణ పట్ల పూర్తి ప్రాధాన్యతను ఇస్తుందనే సంకేతాలు కూడా ప్రజల్లోకి వెళ్తాయని పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నారు. అలా ప్రభుత్వం నిజంగానే ఆలోచిస్తే 1994, 1995 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు సీనియర్ మహిళ ఐపీఎస్‌లు రేసులో ఉండే అవకాశం ఉంది. అందులో ఓ మహిళా ఆఫీసర్ ప్రస్తుతం నాలుగు విభాగాలను సింగిల్ హ్యాండ్‌తో అందరిని సమన్వయం చేసుకుంటూ సమర్ధవంతంగా నడిపిస్తున్నారు. మరో మహిళా అధికారి కూడా కీలక పోస్టులో ఇప్పుడు విధులను నిర్వహిస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు




-మొదటిపేజీ తరువాయి

పిటిషనర్ వాదనలు వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నలుగురు పోలీసు అధికారులను అరెస్ట్ చేశారు. ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరిని నిందితులుగా చేర్చారు. సిట్ దర్యాప్తు బృందం కస్టడీలో వారి వాంగ్మూలాన్ని నమోదు చేసింది.

మరోవైపు, భుజంగరావు, తిరుపతన్నలు తమకు బెయిల్ ఇవ్వాలని నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తమను రాజకీయ దురుద్దేశంతో అరెస్ట్ చేశారని నిందితులు కోర్టుకు తెలిపారు. అయితే వారిని ఇంకా విచారించాల్సి ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. ఇద్దరి బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తయ్యాయి. నాంపల్లి కోర్టు తీర్పును రేపటికి వాయిదా వేసింది.

ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ కేసును ఇంకా విచారించాల్సింది చాలా ఉందని, కాబట్టి బెయిల్ మంజూరు చేయొద్దన్న పీపీ వాదించారు. కాగా ఇరువురి బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తయ్యాయి. బెయిల్ పిటిషన్లపై తీర్పును నాంపల్లి కోర్టు (బుధవారం) ప్రకటించనుంది.ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ కేసును ఇంకా విచారించాల్సింది చాలా ఉందని, కాబట్టి బెయిల్ మంజూరు చేయొద్దన్న పీపీ వాదించారు. కాగా ఇరువురి బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తయ్యాయి. బెయిల్ పిటిషన్లపై తీర్పును నాంపల్లి కోర్టు (బుధవారం) ప్రకటించనుంది.

## నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం



-మొదటిపేజీ తరువాయి


పనిచేస్తాయని మంత్రి చెప్పుకొచ్చారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. "రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం విద్యతోపాటు ఇంగ్లీష్ మీడియం కూడా అందిస్తున్నాం. కళాశాల విద్యకూ పెద్దపీట వేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైంది. రూ.39వేల కోట్లతో మిషన్ భగీరథ పథకం ప్రారంభించినా.. జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు వాటర్ సప్లై అధ్వానంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకాన్ని పునరుద్ధరించి గిరిజన ప్రాంతాలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. ధరణిపై కమిటీ నివేదిక త్వరలో రానుంది, అందులోని ఇబ్బందికర అంశాలను తొలగించి, పెండింగ్‌లో ఉన్న 2.55లక్షల దరఖాస్తులు పరిష్కరిస్తాం. విత్తనాలు అందుబాటులో లేవని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. మేలైన ఒకే రకం విత్తనాలపై ప్రచారం చేసి కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ రైతులను బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు గురి చేస్తున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్‌ఉండదంటూ దుష్ప్రచారాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పవర్ కట్ అనే సమస్యే లేదు. ప్రభుత్వ స్థలాలను ఏ స్థాయి వ్యక్తులు కబ్జా చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు మూసుకొని ఉండదు" అని హెచ్చరించారు.

## కూల్ కూల్‌గా.. హాయిగా...

-మొదటిపేజీ తరువాయి

కూడా ఎక్కువగా ఉండటంతో ప్రజలు అల్లాడి పోయారు. ఇంట్లో ఉన్నా ఉక్కపోతతో సక్రమంగా నిద్రకూడా కరవయింది. ఇక ఏసీ, ఫ్యాన్లు నిరంతరం ఆన్ లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్తు బిల్లులు గత రెండు నెలల నుంచి తడచి మోపెడయ్యాయి. అయినా సరే ఈ ఎండల నుంచి బయటపడతామా? అన్న ఆందోళన ప్రతి ఒక్కరిలోనూ అనిపించింది. రోహిణికార్తెలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని భావించారు. ఎండల తీవ్రతకు వడదెబ్బ తగిలిఅనేక మంది మరణించారు. అయితే ఈసారి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోనూ వాతావరణం మారింది. ఎండల తీవ్రత నుంచి చల్లటి వాతావరణానికి మారడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా అనేక వ్యాధులు వస్తాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతానికి వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రజలు కూడా బయటకు వస్తున్నారు. ఈసారి వర్షాలు కూడా ఎక్కువగా పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మరో రెండు రోజులు పాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

## టార్గెట్ తెలంగాణ!



-మొదటిపేజీ తరువాయి

అంతులేని బలాన్నిచ్చింది. తెలంగాణ మీద లభించిన ఈ పట్టును ఏమాత్రం సడలకుండా చేసుకోవాలన్నది ఇప్పుడు బీజేపీ మెయిన్ ప్లాన్. అందుకే, కొత్తగా ఏర్పడిన కేంద్ర ప్రభుత్వంలో.. రెండు పదవులను తెలంగాణకు కట్టబెట్టింది. కిషన్‌రెడ్డిని కేబినెట్ మంత్రిగా కొనసాగిస్తూ కరీంనగర్ నుంచి భారీ మెజార్టీతో రెండోసారి గెలిచిన బండి సంజయ్‌ని కూడా కేబినెట్‌లోకి తీసుకున్నారు మోదీ. అది పార్టీకి మరింత బూస్టప్ అవుతుందని బలంగా విశ్వసిస్తున్నారు తెలంగాణ నేతలు. రాబోయే లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో విజయం సాధించడం ద్వారా.. 2028అసెంబ్లీ ఎన్నికల్లో విక్టరీకి బాటలు వేసుకోవాలని పావులు కదుపుతోంది బీజేపీ. అందుకే, ఇటీవల మల్కాజ్‌గిరి నుంచి భారీ మెజార్టీతో ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌కు రాష్ట్రపార్టీ పగ్గాలు అప్పగించే యోచనలో హైకమాండ్ ఉంది. అయితే ఎంపీ ఎన్నికల్లో వచ్చిన 36 శాతం ఓట్లు కాపాడుకోవడం.. ఇప్పుడు పార్టీ ముందున్న అతిపెద్ద సవాల్. తెలంగాణలో ఎవరు పార్టీపగ్గాలు చేపట్టినా.. బీఆర్ఎస్‌ను రిప్లేస్ చేయడమే ఇంపార్టెంట్‌టాస్క్ అవుతుంది. స్థానిక ఎన్నికల్లో గెలిపించి రాష్ట్రంలో అధికారం దిశగా తీసుకువెళ్లడమే ప్రధాన లక్ష్యమవుతుంది. పార్టీకి లోకల్‌గా ఊతమిచ్చేలా రెండు కేంద్రపదవులు కట్టబెట్టిన హైకమాండ్%%% రాష్ట్ర బీజేపీ సీనియర్ నేతలకు జాతీయ స్థాయిలో కీలక పొజిషన్లు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. తెలంగాణపై ఇలా స్పెషల్ అటెన్షన్ క్రియేట్ చేయడం ద్వారా.. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందనే భరోసాను ప్రజల్లో నింపే విధంగా అడుగులు వేస్తోంది హైకమాండ్. కాంగ్రెస్‌కు ధీటుగా రాష్ట్రంలో ఎదగాలనుకుంటున్న బీజేపీ.. తన యాక్షన్ ప్లాన్ అమలులో ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి మరి.

వాస్తవ నేస్తం STATE NEWS బుధవారం 12 జూన్ 2024



# ద్వితీయశ్రేణులు... కిం కర్తవ్యం




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కు ప్రస్తుతం కష్టకాలం దాపురించింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో కనీస పోటీ ఇవ్వలేని పరిస్థితికి దిగజారారు. దాదాపు ఎనిమిది లోక్ సభ సీట్లలో డిపాజిట్లు కోల్పోవడం అంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పదేళ్లు ఏకచ్ఛత్రాధిపత్యంతో తెలంగాణలో తిరుగులేని రాజకీయ శక్తిగా మారిన బీఆర్ఎస్ నేతలకు ఇప్పుడు ప్రజలలో తిరగలేని పరిస్థితి ఏర్పడిందని సొంత పార్టీ నేతలే తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఏ ప్రాంతీయ సమస్యలను నెత్తికెత్తుకుని సెంటిమెంట్ గా తెలంగాణలో పదేళ్ల అధికారం దక్కించుకుందో అదే సెంటిమెంట్ పులిమీద స్వారీలా తయారయింది. ప్రాంతీయ పార్టీని జాతీయ స్థాయిలో తీసుకెళదామనే కేసీఆర్ ఆలోచనే ఆ పార్టీ పతనానికి నాంది అయింది. టీఆర్ఎస్ గా ఉన్నంతకాలం ఆ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బీఆర్ఎస్ గా మార్చేసరికి ఆ పార్టీ అస్థిత్వాన్ని కోల్పోయే పరిస్థితికి వచ్చింది అని రాజకీయ పండితులు చెబుతున్న మాట.లోక్ సభ ఎన్నికల్లో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఆధిక్యతలను చూస్తే.. కాంగ్రెస్ పార్టీ తన స్థానాలు కొన్ని మారినా మొత్తంగా 64 సీట్లలో ఆధిక్యాన్ని చూపించుకుంది. బీజేపీ ఏకంగా 58 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యాన్నిచూపించింది. మజ్లిస్ పార్టీ తన ఏడు సెగ్మెంట్లలో ఆధిక్యాన్ని నిలుపుకుంది. నాంపల్లిలో మాత్రం.. వెనుకబడింది. అక్కడ కాంగ్రెస్ ది ఆధిపత్యం అయింది. బీఆర్ఎస్ కు మాత్రం మూడు సెగ్మెంట్లలోనే ఆధిక్యం వచ్చింది.నవంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 39సీట్లను సాధించుకుంది. కాంగ్రెస్ మిత్రపక్షంతో కలిసి అరవై ఐదు గోల్చుకోగా.. బీజేపీ ఎనిమిది దగ్గర ఆగిపోయింది. ఇదంతా బీఆర్ఎస్ నేత అనాలోచిత చర్య వలనే చేజేతులారా పార్టీని పాతాళానికి నెట్టినట్లయిందని అంటున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకును బీజేపీకి త్యాగం చేయడం వలనే ఈ పరిస్థితి దాపురించింది. నేనే బీఆర్ఎస్ లీడర్ ని అయితే భవిష్యత్ పై ఖచ్చితంగా ఆందోళన చెందుతానని ఎన్నికల ముందు ప్రశాంత్ కిషోర్ చెప్పారు. పరోక్షంగా బీజేపీని బలోపేతం చేయడానికే కేసీఆర్ డిసైడ్ అయినట్లు కనిపిస్తోంది. అందుకోసం తన బిడ్డ లాంటి ప్రాంతీయ పార్టీని బలిపశువును చేయడానికి కేసీఆర్ ఏ మాత్రం ఆలోచించకుండా అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. కనీసం గెలుపు గుర్రాలపై ఫోకస్ పెట్టకుండా ఓడిపోతారని ముందే తెలిసిన నేతలను బీజేపీ బలంగా ఉన్న చోట్ల నిలబెట్టడం చూస్తే ఆ పార్టీ భవిష్యత్తులో బీజేపీతో అంటకాగడం ఖాయంగా కనిపిస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.పార్టీలో ఉన్న ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు ఏ పార్టీలోకి వెళితే తమ భవిష్యత్తు బాగుంటుందా అని ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఎందుకంటే ప్రస్తుతానికి తెలంగాణలో ఏ ప్రాంతీయ పార్టీ లేకుండా పోయింది. బీఆర్ఎస్ ను కూడా ప్రాంతీయ పార్టీ అనడానికి వీలులేకుండా కేసీఆర్ మార్చేశారు. ఇప్పుడు తెలంగాణలో ఉన్నది కేవలం జాతీయ పార్టీలే. అందునా అధికారంలో ఉన్న కాంగ్రెస్ రోజురోజుకూ బలపడుతోంది. ఇటీవల జరిగిన ఎన్నికలలో మోదీకి ముచ్చెమటలు పట్టించే పరిస్థితికి తెచ్చింది కాంగ్రెస్. రాహుల్ గాంధీ సైతం కూటమిలో హీరోగా ఎదుగుతున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో దాదాపు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చే దిశగా రాహుల్ గాంధీ ఎదుగుతున్నారు. ఇక ప్రతిపక్ష నేతగా ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసే ప్రజా నేత పాత్ర వహించబోతున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ ను వీడి వేరే పార్టీలోకి వెళదామనుకునే నేతలంతా కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారంబీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లడం ఒక్కటే మార్గంగా కనిపిస్తోంది. నమ్ముకున్న బీఆర్ఎస్ పార్టీ సున్నా స్థితికి వచ్చింది. బీజేపీ కూడా మెల్లిగా డౌన్ ఫాల్ అవుతూ వస్తోంది. ఈ పార్టీలతో పోల్చుకుంటే రైజింగ్ స్థితిలో ఉన్నది కేవలం కాంగ్రెస్ పార్టీయే అని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భావిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో అయోధ్యలోనే బీజేపీ ఓడిపోవడం, మతాన్ని నమ్ముకుని ఉత్తర ప్రదేశ్ లో చేసిన బీజేపీ ప్రచారం బెడిసికొట్టడంతో బీజేపీ అగ్ర నేతలే ఆలోచనలో పడ్డారు. అలాగే వారణాసిలో 2019లో ఐదు లక్షలకు పైగా మెజార్టీ వచ్చిన మోదీకి ఈసారి లక్షకు పైగా మాత్రమే రావడం చూస్తుంటే ఇవన్నీ బీజేపీకి వ్యతిరేకతాంశాలే. బీఆర్ఎస్కు పోటీగా రెండు జాతీయ పార్టీలు ఉన్నాయి. ఒకటి రాష్ట్రంలో అధికారంలో ఉంది. మరొకటి కేంద్రంలో అధికారంలో ఉంది. ఓడిపోయి నిస్సహాయ స్థితిలో ఉన్న పార్టీ రెండు జాతీయ పార్టీలతో పోరాడటం అంటే.. కేసీఆర్ కు..బీఆర్ఎస్కు అంత తేలిక కాదు. అందుకే భిన్నమైన రాజకీయం చేయబోయి నలిగిపోయారు. బీజేపీ లక్ష్యం ప్రాంతీయపార్టీల్ని అమాంతం మింగేయడం. తెలంగాణలో అలాంటి చాన్స్ ఉందని మోదీ, షాలకు తెలుసు. ఇలాంటి సందర్భంలో ఎలా వ్యవహరించాలో వారికి బాగా తెలుసు. ఈ రాజకీయాల్లో వారు మాస్టర్లు. అందుకే బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. కేసీఆర్.. తెలంగాణ ఉద్యమాన్ని అద్భుతంగా నడిపించారు. రాష్ట్రంలో రెండే పార్టీలు ఉంటే ఏమీ చేయకపోయినా అధికారపార్టీపై కోపంతో ప్రతిపక్షంకి ఓట్లేస్తారు. కానీ మూడు పార్టీలు ఉంటే ప్రజలకు ప్రత్యామ్నాయం ఉన్నట్లే. బీఆర్ఎస్ ఈ లాజిక్ ను అర్థం చేసుకుని కష్టపడాల్సి ఉంది. ఇందు కోసం కేసీఆర్ వద్ద ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో క్యాడర్ కు సైతం అర్థం కావడం లేదు.

# ఎన్ కౌంటర్లతో ఏజెన్సీలో భయం.. భయం

**వరంగల్ :** తెలంగాణ ఛత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ములుగు జిల్లా ఏజెన్సీలో టెన్షన్ వాతావరణం నెలకొంది. మావోయిస్టు పార్టీ మందు పాతరలు దడ పుట్టిస్తున్నాయి. ఇప్పటికే మందు పాతర పేలి ఓ వ్యక్తి చనిపోగా.. వరుసగా మావోయిస్టుల మందుపాతరలు పోలీసులు వెలికితీసి నిర్వీర్యం చేయడంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎక్కడ.. ఎప్పుడు ఇలాంటి పేలుడు వార్త వినాల్సివస్తుందో.. ఆ బాంబులు ఎవరిని బలి తీసుకుంటాయో అని హడలెత్తిపోతున్నారు. పోలీసులు ? మావోయిస్టుల మధ్య ఆధిపత్య పోరులో సామాన్యులు నలిగి పోతున్నారు. మావోయిస్టుల ఉనికే లేకుండా చేయడం కోసం పోలీసులు అస్త్రశస్త్రాలతో అడవులను జల్లెడ పడుతున్నారు. మరోవైపు పోలీసులను మట్టు పెట్టడం కోసం మావోయిస్టులు అమర్చిన బూబీట్రాప్స్ ఇప్పుడు జనం గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.ములుగు జిల్లా ఏజెన్సీలోని వాజేడు, వెంకటా పురం మండలాల్లో క్షణక్షణం టెన్షన్ వాతావరణం నెలకొం టుంది. ఈనెల 3వ తేదీన కొంగాల గుట్టపై మావోయిస్టులు అమర్చిన ట్రాప్ బుబీ పేలి యేసు అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత మావోయిస్టులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి ఇప్పటికి గ్రామాల్లో నిరసనలు కంటిన్యూ అవుతున్నాయి . మరోవైపు



మావోయిస్టులు కూడా మందు పాతర పేలుళ్లపై లేఖవిడుదల చేశారు. తమ డెన్నులను కనిపెట్టడం కోసం ఇన్ ఫార్మర్లను అడవిలోకి పంపి పోలీసులే వారి చావుకు కారణం అవుతున్నారని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. మందుపాతర పేలు చనిపోయిన ఏసు కూడా పోలీసుల డైరెక్షన్లోనే అడవిలోకి వచ్చి మందు పాతరలకు బలయ్యాడని లేఖ విడుదల చేశారు. అంతేకాదు ఈ ప్రాంతంలో చాలా మందు పాతరలు ఉన్నాయని మా ఆత్మరక్షణ కోసం మందుపాతరలు అమర్చామని మావోయిస్టులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మందు పాతరలు ఏజెన్సీ ప్రజలు ఆడలెత్తిపోయేలా చేస్తున్నాయి. ఎప్పుడు.. ఎక్కడ ఇలాంటి పేలుడు వార్త వినాల్సి వస్తుందో..! ఆ పేలుళ్లు ఎవరిని బలి తీసుకుంటాయో అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అయితే మందు పాతరలను నిర్వీర్యం చేయడం కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. ఇటు రహదారుల వెంట అమర్చిన మందు పాతరలతో పాటు అడవుల్లో అమర్చిన మందు పాతరాలను కూడా వరుసగా నిర్వీర్యం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం జగన్నాధపురం గ్రామ సమీపంలోని చలిమెల అడవుల్లో ఒక ల్యాండ్ మైన్ నిర్వీర్యం చేశారు. తాజాగా జగన్నాథపురం గ్రామ శివారులో రహదారి పక్కనే మరో మందుపాతర గుర్తించి నిర్వీర్యం చేశారు. ఆ ప్రాంతమంతా బాంబ్ డిస్పోస్ స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచిస్తున్నారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజల ప్రాణాలకు ముప్పు తేవద్దని హెచ్చరిస్తున్నారు.

# అగ్నిపథ్ స్కీంలో మార్పులు...

**న్యూఢిల్లీ :** ఎన్డీఏ పక్షాల డిమాండ్ల నేపథ్యంలో అగ్నిపథ్ స్కీమ్లో భారీమార్పులు చేసే దిశంగా కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం నాలుగేళ్లు ఉన్న సర్వీసును 7-8 ఏళ్లకు పెంచనుందని, వారిలో 60-70 శాతం మందిని పర్మినెంట్ చేయనున్నట్లు తెలుస్తోంది. టెక్నికల్ గ్రేడ్లలో ప్రవేశాలకు వయోపరిమితిని 23 సంవత్సరాలకు పెంచనుంది. ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయినవారికి భారీ పరిహారం ఇవ్వడం, దేశసేవలో చనిపోయినవారి కుటుంబాలకు భత్యం తదితర అంశాల గురించి యోచిస్తున్నట్లు సమాచారం. త్రివిధ దళాల్లో నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వం 'అగ్నిపథ్' స్కీమ్ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద ఎంపికైనవారిని 'అగ్నివీర్లు'గా పిలుస్తున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. ఈ పథకం కింద ఎంపిక చేసిన యువతలో 25 శాతం మందినే నాలుగేళ్ల తర్వాత ఆర్మీలో పర్మినెంట్ చేస్తున్నారు. అయితే దీనిని 60 నుంచి 70 శాతంకు పెంచాలనే ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రానికి అందాయి. అంతేకాకుండా.. సాంకేతిక నేపథ్యం ఉన్న యువకులను చేర్చుకోవడం, గరిష్ట వయోపరిమితిని 23 సంవత్సరాలకు పెంచాలనే ప్రతిపాదన కూడా ఉంది. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు ప్రతిపాదనలు వచ్చినట్టుగా తెలుస్తోంది. 2026 నాటికి దాదాపు 1.75 లక్షల మంది యువకులు 'అగ్నిపథ్' పథకం కింద త్రివిధ దళాల్లో చేరే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అగ్నిపథ్ పథకం కింద 17.5 - 21 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అభ్యర్థులను 'అగ్నివీర్' పోస్టులకు ఎంపికచేస్తున్నారు. అయితే సాంకేతిక నేపథ్యం ఉన్న అభ్యర్థుల విషయంలో గరిష్ట రిక్రూట్మెంట్ వయసు 21 ఏళ్లలోపు పరిమితిని సడలించే అవకాశాలు ఉన్నాయని బలగాలు అభిప్రాయపడుతున్నాయి. గరిష్ట వయోపరిమితిని సవరించడం.. దానిని 23 సంవత్సరాలకు పెంచడంపై ప్రధానంగా చర్చ జరుగుతోంది.కేంద్రంలో ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వ కొలువుదీరిన నేపథ్యంలో.. అప్పుడే మిత్రపక్షాల నుంచి డిమాండ్లు మొదలయ్యాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'అగ్నివీర్' పథకాన్ని సమీక్షించాల్సిందేనని ఎన్డీయే మిత్రపక్షం జేడీయూ కోరింది. త్రివిధ దళాల్లో సైనిక నియామకాల కోసం రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకమే 'అగ్నిపథ్'. అయితే నాలుగేళ్ల కాలపరిమితితో ఉండే ఈ సర్వీసు అంశంపై అప్పట్లోనే తీవ్ర దుమారం రేగింది. దేశవ్యాప్తంగా నిరసనజ్వా లలు చెలరేగాయి. ప్రతిపక్షాలు సైతం ఈ పథకంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. అయినప్పటికీ.. అగ్నివీర్ పథకం ద్వారా అగ్నివీర్లను ఎంపిక చేసే ప్రక్రియను కేంద్రం యథావిధిగా కొనసాగించింది. ఇండియా కూటమిలో ప్రధానపార్టీగా కొనసాగుతున్న సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సైతం అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాల్సిందేననే గళం బలంగా వినిపిస్తున్నారు. ప్రభుత్వం ఆ తప్పిదాన్ని ఒప్పుకుని.. వెంటనే దానిని రద్దు చేయాలని కోరుతున్నారాయన. భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ వీకే సింగ్ అగ్నిపథ్ పథకానికి మార్పులు చేయాల్సిన అవసరం ఉందని ఇటీవల అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం అమలవుతున్న అగ్నివీర్/అగ్నిపథ్ నియామక పథకంలో అవసరమైతే మార్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్ ఈ ఏడాది మార్చిలో ఒక ప్రకటన చేశారు. తాజాగా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటంతో మిత్రపక్షాల ఒత్తిడిమేరకు ప్రభుత్వం మార్పులకు ముందడుగు వేసినట్లు తెలుస్తోంది.



## సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసిన ఆత్రం భాస్కర్



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** సీఎం రేవంత్ రెడ్డిని, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కలను హైదరాబాద్ లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆత్రం భాస్కర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ రావడంతో పట్ల ఆత్రం భాస్కర్ ను రేవంత్ రెడ్డి అభినందించారు. పార్లమెంట్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్, పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, తదితరులు ఉన్నారు.

## రెండు కుటుంబాల బాహాబాహీ

**మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా సురారం పియస్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో 60గజాల ప్రభుత్వ స్థలం విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవ చేలరేగింది. 60గజాల స్థలం మాదంటే మాదని రోడ్డుపై బాహబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. కోట్లాటలో తీవ్రంగా గాయపడిని ఒక మహిళ రోడ్డుపైనే సొమ్మసిల్లి పడిపోయింది.

## రాష్ట్రాలకు పన్నులు పంపిణీ

**ఢిల్లీ :** 1,39,750 కోట్ల పన్నులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పంపిణీ చేసింది. అత్యధికంగా ఉత్తర ప్రదేశ్ కి 25,066.88 కోట్లు, బిహార్ కు 14056.12 కోట్లు, మధ్య ప్రదేశ్ కు 10,970.44కోట్లు, పశ్చిమ బెంగాల్ కు 10,513.46 కోట్లు విడుదల అయ్యాయి. ఇక ఏపీకి 5655.72 కోట్లు విడుదలవగా, తెలంగాణకు 2937.58 కోట్లు మంజూరు అయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు ఇప్పటివరకు 2,79,500 కోట్లు పంపిణీ చేసినట్లు కేంద్రం తెలిపింది.

## తెలంగాణ టెట్ ఫలితాలు

**హైదరాబాద :** తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ 2024) ఫలితాలు జూన్12న వెల్లడి కానున్నాయి. ఇప్పటికే టెట్ పరీక్షకు సంబంధించిన ప్రైమరీ ఆన్సర్ కీ విడుదల చేయగా.. దానిపై అభ్యంతరాలు స్వీకరించి తుది ఆన్సర్ కీని రూపొందించింది. రేపు ఫైనల్ ఆన్సర్ కీతోపాటు ఫలితాలను వెల్లడించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. కాగా తెలంగాణ టెట్ పరీక్షలు మే 20 నుంచి జూన్ 2 వరకు జరిగిన సంగతి తెలిసిందే. తొలిసారి రాష్ట్రంలో ఆన్లైన్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సారి టెట్ పరీక్షలకు 2,86,381 దరఖాస్తు చేసుకోగా.. వారలో పరీక్షలకు 2,36,487 మంది హాజరయ్యారు. పేపర్ వారీగా చూస్తే.. పేపర్-1కు 99,958 మంది దరఖాస్తు చేసుకోగా 86.03 శాతం మంది హాజరయ్యారు. ఇక పేపర్-2కి 1,86,423 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 82.58 శాతం మంది హాజరయ్యారు. టెట్ పరీక్షకు తెలుగు రాష్ట్రాల్లో యమ డిమాండ్ ఉంటుంది. డీఎస్సీ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. అలాగే ప్రభుత్వ టీచర్ పోస్టుల నియామకాలకు నిర్వహించే టీచర్స్ రిక్రూట్మెంట్ టెస్ట్ (టీఆర్టీ) రాసేందుకు టెట్లో తప్పనిసరిగా అర్హత సాధించవల్సి ఉంటుంది. అందువల్లనే బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు ప్రతీసారి టెట్ పరీక్షలో అధిక స్కోర్ సాధించేందుకు అధిక సంఖ్యలో పోటీపడుతుంటారు. మరోవైపు ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్లో టెట్ పరీక్ష నిర్వహించిన అక్కడి సర్కార్ ఇప్పటి వరకూ ఫలితాలు వెల్లడించలేదు.

## ధర్మపురికి ఆశాభంగం

**నిజామాబాద్ :** మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్రావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే.. ఆయన కూతురు.. ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను 2019 లోక్సభ ఎన్నికల్లో నిజాబాబాద్లో ఓడించి సంచలనం సృష్టించాడు ధర్మపురి అరవింద్. పసుపు బోర్డు తెస్తానని బాండు పేపర్ రాసి ఇచ్చి.. కాస్త ఆలస్యంగా అయినే బోర్డు సాధించాడు. ఇదే 2024 లోక్సభ ఎన్నికల్లోనూ అరవింద్ను మళ్లీ నిజామాబాద్ ఎంపీగా గెలిపించింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత అయిన అరవింద్.. రెండోసారి ఎంపీగా గెలిస్తే తనకు మంత్రి పదవి వస్తుందని ఆశించాడు. అందుకే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం పెద్దగా కష్టపడలేదు. ఎంపీగా గెలవడంపైనే దృష్టిపెట్టారు. ఈ క్రమంలో నిజామాబాద్ ఓటర్లు గెలిపించి పార్లమెంటుకు పంపిచారు. కానీ, కేంద్ర మంత్రి కావాలన్న అరవింద్ ఆశ మాత్రం నెరవేరలేదుతనను ఎంపీగా గెలిపిస్తే కేంద్ర మంత్రి అవుతానని అర్వింద్ ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకున్నారు. ఈసారి తనను గెలిపిస్తే మంత్రిగా తిరిగి వస్తానని చెప్పుకున్నారు. ఇది కూడా ఆయన విజయానికి దోహదపడింది. అయితే సామాజిక కోణం కలిసి వచ్చినా.. విధేయత విషయంలో సంజయ్తో పోల్చుకుంటే వెనుకపడ్డాడు. అయితే బండికి ఇప్పటికే జాతీయ కార్యదర్శి పదవి ఉన్నందున మంత్రి పదవి ఖాయమనుకున్నాడు. కానీ, మరో బీసీ నేత ఈటల ఉన్నా కొత్తగా పార్టీలోకి వచ్చినందున తనకే ఛాన్స్ దక్కుతుందని ఆశపడ్డాడుబీసీ కోటాతో సంజయ్, లక్ష్మణ్, అరవింద్, ఈటల రాజేందర్ వంటి కీలక నేతలు ఉన్నా.. డీకే ఆరుణ, కిషన్రెడ్డి, కొండా విశ్వేశ్వర్రెడ్డి కూడా మంత్రి పదవి ఆశించారు. కానీ, అధిష్టానం మాత్రం సంజయ్వైపే మొగ్గు చూపింది. పార్టీ అధ్యక్షుడిగా 8 ఎంపీ సీట్లు గెలిపించిన కిషన్రెడ్డి, తెలంగాణలో పార్టీని బలోపేతం చేసి 8 ఎమ్మెల్యేలు గెలిచేలా చేసిన సంజయ్కు మంత్రి పదవులు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో ఆరవింద్ ఆశలకు గండి పడింది.

## కడప టీడీపీకి క్రాస్ ఓటింగ్ షాక్

**కడప :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. ఇక ఎంపీల విషయానికి వస్తే గత ఎన్నికల్లో 22 మందిని లోక్సభకు పంపించిన వైసీపీ ఈసారి కేవలం నలుగురిని మాత్రం గెలిపించుకుంది. కడప ఎంపీగా అవినాష్ రెడ్డి, రాజంపేట ఎంపీగా మిథున్ రెడ్డి గెలిచారు. తిరుపతి నుంచి గురుమూర్తి, అరకు నుంచి చెట్టి తనూజా రాణి విజయం సాధించారు. మిగిలినవి అన్నీ కూటమి ఖాతాలో పడ్డాయి. అయితే.. నిజానికి జగన్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కడప ఎంపీ కూడా టీడీపీ ఖాతాలో పడినట్టేనని పసుపు తమ్ముళ్లు అంటున్నారు. షర్మిల లేకపోతే కాంగ్రెస్ కు పడిన ఓట్లు టీడీపీకి పడాల్సిందనే వాదనలు విపిస్తున్నారు. నిజానికి టీడీపీ చూస్తున్న లెక్కల్లో ఓ లాజిక్ కూడా ఉంది.కడప ఎంపీ పరిధిలో పులివెందుల, బద్వేల్ మాత్రమే వైసీపీ గెలిచింది. కడప పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులకు వచ్చిన మొత్తం ఓట్లు 6 లక్షల 25 వేలు. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీకి 6 లక్షల ఓట్లు వచ్చాయి.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com